మహిళా సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ కృషి

- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు
- 48వ డివిజన్‌లో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహిళా సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాటుపడుతుందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఇచ్చిన మాట నిలుపుకున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. నియోజకవర్గంలోని 48, 49, 51వ డివిజన్ల పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడో విడత చెక్కుల పంపిణీ బుధవారం నిర్వహించారు. 48వ డివిజన్ పరిధిలోని సోరంగం రోడ్డులోని విశ్వబ్రహ్మణ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు అత్తులూరి ఆదిలక్ష్మి, బుల్లా విజయ్‌కుమార్, మరుపిళ్ల రాజేష్ విచ్చేశారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావులతో అతిథులు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ సందర్భంగా పలువురు చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.


సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు

మహిళా లోకం జైజైలు..
అనంతరం డ్వాక్రా సంఘాల సభ్యులనుద్దేశించి ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ.. వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ పశ్చిమ నియోజక వర్గంలో పండుగ వాతావరణంలో జరుపుకుంటున్నామన్నారు. 543 సంఘాలకు చెందిన 5430 మంది మహిళలకు రూ.3,82,57,061లు చెక్కులను పంపిణీ చేశామన్నారు. గతంలో మహిళల సంక్షేమానికి పాటు పడుతున్నామని మాటలు చెప్పే ముఖ్యమంత్రిని చూశామని, ఇప్పుడు చెప్పడమే కాదు చేసి చూపే ముఖ్యమంత్రిని చూశామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మాట నిలబెట్టుకున్న సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి మహిళా లోకం జైజైలు పలుకుతుందన్నారు. మహిళల సొంత ఇంటి కలను నెరవేర్చిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల అధ్యక్షులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బాబు పాలనలో అభివృద్ధి శిలఫలకాలకే పరిమితం

వన్‌టౌన్(విజయవాపశ్చిమ): చంద్రబాబు పాలనలో అభివృద్ధి శిలఫలకాలకే పరిమితమైందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. కొత్తపేట 51వ డివిజన్ కొండ ప్రాంతంలోని అడ్డరోడ్డులో రూ.25 లక్షలతో నూతనంగా నిర్మాణం చేసిన సచివాలయ అదనపు భవన సముదాయాన్ని ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగనన్న పాలనలో నియోజకవర్గాన్ని పూర్తిగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత పాలకుల పాలనలో అభివృద్ధి కేవలం కాగితాలకు, శిలఫలకాలకే పరిమితమైందన్నారు. తాము శంకుస్థాపనలతో పాటుగా ప్రారంభోత్సవాలను సైతం చేసి అభివృద్ధి చూపించామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి 15వ, 16వ ఆర్థిక సంఘం నిధులను కేటాయించి సహకరించిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కొండ ప్రాంతంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. అమరావతి పేరుతో విజయవాడ ప్రజలను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి

అభివృద్ధి పరుగులు..
మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. నగరంలో మూడు నియోజకవర్గాలు అభివృద్ధిలో పోటీ పడుతున్నాయన్నారు. ప్రధానంగా వెలంపల్లి శ్రీనివాసరావు సారథ్యంలో పశ్చిమంలో అభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు. రహదారులు, పార్కులు, ఆరోగ్య కేంద్రాలు, మంచినీటి వసతులు ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు జోరుగా జరుగుతున్నాయని చెప్పారు. కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పణుకు ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా గజవాహన సేవ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ కొత్తగుళ్ల ప్రాంగణంలో వేం చేసి ఉన్న శ్రీ కోదండ రామస్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి గజవాహన సేవ బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. సాయంత్రం గజవాహన సేవను వైభవంగా నిర్వహించారు. అలాగే స్వామి వారి వివాహ వేడుకలను పురస్కరించుకొని ఎదుర్కోలోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు. వైదిక కార్యక్రమాలను పులిపాక ఆంజనేయాచార్యులు రాఘవాచార్యులు నిర్వహించారు.

నగరాల సీతారామస్వామి వారి ఆలయంలో..
కొత్తపేటలోని శ్రీ నగరాల సీతారామస్వామి వార్ల దేవస్థానంలో స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పలు వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిప్రతిష్టాపన, వాస్తుహోమం, భేరిపూజ, ధ్వజపట ప్రతిష్ఠ, ధ్వజారోహణాది కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ధ్వజారోహణం ద్వారా సకల చరాచర జీవప్రకృతికి ఆదిదేవుడైన శ్రీరామచంద్ర ప్రభువు వివాహానికి సకల దేవతామూర్తులను ఆహ్వానించామని పండితులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


గజవాహనంపై కోదండ రాముడు

ఐక్యంగా ఉన్నప్పుడే ఏదైనా సాధించగలం

ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విశ్వబ్రాహ్మణులందరూ ఐక్యంగా ఉండాలని, అప్పుడే అనుకున్నదేదైనా సాధించగలమని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ అన్నారు. గొల్లపూడి పరిధిలోని బీసీ సంక్షేమ భవన్‌లోగల తన కార్యాలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలను చేశారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్ర సంఘం ద్వారా సంఘీయులందరికీ భరోసా కల్పించే పనులు చేయాలని కోరారు. ప్రభుత్వం బీసీలకు పెద్ద పీట వేసి అందిస్తున్న సంక్షేమ పథకాలను అందిపుచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో రాష్ట్ర నాయకులు రాష్ట్రవ్యాప్తంగా భారీ సమావేశాలను ఏర్పాటు చేయాలని, గ్రామ స్థాయి నుంచి సంఘ కమిటీలను నియమించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాలను ఆధునీకరణ చేయాలని కోరారు. శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠానికి విజయవాడ నుంచి బస్ సౌకర్యం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి గ్రామంలో రుద్రభూముల కోసం ప్రభుత్వాన్ని కోరాలని నిర్ణయించారు. రాష్ట్ర సంఘానికి మూల ధనం ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా సంఘీయులకు సేవా కార్యక్రమాలను చేపట్టాలని తీర్మానించారు. విశ్వబ్రాహ్మణుల సమస్యలపై ప్రభుత్వ పెద్దలను, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి విన్నవించాలని తీర్మానించారు. సమావేశంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చేవూరి రామస్వామి, ప్రధాన కార్యదర్శి గోకవరపు శ్రీనివాస్, మాజీ ప్రధాన కార్యదర్శి ఆశ్లేషాచారి, రాష్ట్ర నాయకులు బి.ఉమామహేశ్వరరావు, చేవూరి రమేష్, ఎం.ప్రసాద్, జి.కె.ఆనంద్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి పాల్గొన్నారు.


సంఘీభావం తెలుపుతున్న శ్రీకాంత్, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టడంలో విద్యార్థులు చైతన్యవంతులు కావాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) భవానీపురం స్టేషన్ హౌస్ ఆఫీసర్ పి.శ్రీనివాస్ కోరారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా మాదకద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే అనర్థాలపై కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని శ్రీ అలిగినేని పెద ముత్తయ్య జెడ్పీపీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సదస్సుల్లో శ్రీనివాస్ మాట్లాడారు. గంజాయి లేదా మాదక ద్రవ్యాల విక్రయం, కొనుగోలు, అక్రమ రవాణాకు సంబంధించి ఎటువంటి సమాచారం తెలిసినా వెంటనే తమకు గానీ, సమీపంలోని పోలీస్ స్టేషన్‌లోగానీ తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారు పేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. విద్యార్థుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకే ఇటువంటి సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు పోలీసులతో చేతులు కలిపి విజయవాడ నగరాన్ని మాదక ద్రవ్య రహిత నగరంగా తీర్చిదిద్దాలని కోరారు. డ్రగ్స్ వినియోగంతో నేర ప్రవృత్తికి అలవాటు పడతారన్నారు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. సదస్సులో పాఠశాల హెచ్‌ఎం ఎన్.కమలాకరరావు, ఎంఎస్‌కేలు వి.అరుణకుమారి, కేబీఎస్ జ్యోతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

పెనమలూరు: భర్త అదృశ్యమయ్యాడని భార్య ఫిర్యాదు చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం... కానూరు సద్దిక్‌నగర్‌కు చెందిన షేక్.లతీఫ్‌బాషా గతంలో ఓ వ్యక్తి వద్ద అప్పు తీసుకున్నాడు. డబ్బు ఇచ్చిన వ్యక్తి అప్పు తీర్చమని ఒత్తిడి చేయటంతో అతను హైదరాబాద్‌లో ఉన్న మరో వ్యక్తి వద్ద అప్పుచేసి సొమ్ము తీసుకురావటానికి ఈ నెల 5వ తేదీన హైదరాబాద్‌కు వెళ్లాడు. అయితే అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాలేదు. భార్య షేక్.రషీదా ఫోన్ చేస్తే భర్త ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో భార్య తన భర్త కనబడటం లేదని పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

రాములోరి కల్యాణానికి ఆలయాల ముస్తాబు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రముఖులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి ఆలయాలు ముస్తాబయ్యాయి. రామాలయాలు, వాణిజ్య సంఘాలు, వివిధ వైష్ణవాలయాల్లో నవమి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నంలో శ్రీరామచంద్రుని కల్యాణం నిర్వహించేందుకు ఆయా ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. వన్‌టౌన్‌లోని వివిధ ప్రాంతాల్లో నవమి వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు ఇతర కల్యాణ సన్నాహాలను పూర్తి చేసినట్లు వాటి నిర్వాహకులు తెలిపారు. దీంతో ఆయా ప్రాంతాలు బుధవారం సాయంత్రం నుంచే కళకళలాడుతూ దర్శనమిస్తున్నాయి.

ప్రారంభమైన నవమి వేడుకలు
వన్‌టౌన్‌లోని పలు ఆలయాల్లో స్వామివారి శ్రీరామనవమి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. భావనారాయణవీధిలోని శ్రీ కోదండరామ స్వామి వారి దేవస్థానంలో కూడా ఉత్సవాలకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాటితో పాటుగా శివాలయంవీధిలోని రామాలయం, వస్తలత ప్రాంగణంలోని రామాలయం, సైకం వారివీధిలో వేంచేసి ఉన్న రామాలయాల్లో ఇతర ప్రాంతాల్లోని వైష్ణవాలయాల్లో సైతం ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

కళకళలాడుతున్న బజార్లు
శ్రీరామనవమి సందర్భంగా వ్యాపారులతో ఆయా ప్రాంతాలు కళకళలాడుతున్నాయి. ప్రధానంగా కాశేశ్వరరావు మార్కెట్ సెంటర్ పరిసరాలు నుంచి రద్దీగా దర్శనమిస్తున్నాయి. నగరం పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు మామిడి ఆకులు, ఇతర పూజా సామాగ్రిని విక్రయిస్తూ సందడి చేస్తున్నారు. అదేవిధంగా వన్‌టౌన్‌లోని మొయిన్‌బజార్, సామారంగం చౌక్, శివాలయంవీధి తదితర ప్రాంతాలు సైతం బిజీబిజీగా దర్శనమిచ్చాయి.


నగరాల రామాలయం వద్ద సిద్ధమైన రథం

నగరాల సీతారామస్వామి దేవస్థానంలో..
వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ నగరాల సీతారామస్వామి వారి దేవస్థానంలో శ్రీరామనవమి సందర్భంగా గురువారం కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు చెప్పారు. ఈ సందర్భంగా బుధవారం కొత్తపేటలోని రామాలయం కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. భద్రాచలంలో శ్రీరామనవమి వేడుకల తరహాలో తమ ఆలయంలో సీతారామ కళ్యాణాన్ని అత్యంత ఘనంగా నిర్వహిస్తామన్నారు. రాంపిళ్ల మహేశ్వరరావు భాగ్యలక్ష్మి దంపతులచే కల్యాణోత్సవం జరుగుతుందని చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా 31వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు పాతబస్తీ కొత్తపేట, నగర వీధుల్లో రథోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ గౌరవ అధ్యక్షుడు బెవర సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు మరుపిళ్ల సత్యనారాయణ, బెవర శ్రీనివాస రావు, సహాయ కార్యదర్శులు పొట్నూరి దుర్గాప్రసాద్(రాజా) పాల్గొన్నారు.

● సొంతూరికి పయనం





ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు బుధవారంతో ముగియడంతో విద్యార్థులు ఉత్సాహంగా సొంతూరికి పయనమయ్యారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఆర్టీసీ బస్టాండ్‌కు రావడంతో బస్టాండ్ ప్రాంగణంలో రద్దీ నెలకొంది. విద్యార్థులు తమ స్నేహితులకు వీడ్కోలు పలికి స్వగ్రామాలకు బయలుదేరి వెళ్లారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా

డ్రెయినేజీ పనులు వేగవంతం చేయండి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేటీరోడ్డులో డ్రెయినేజీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. కొత్తపేట కేటీరోడ్డులో జరుగుతున్న రోడ్డు నిర్మాణం, డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలతో పనులు వేగవంతం చేయాలన్నారు. అలాగే త్వరగా ఆయా రహదారిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. స్థానిక ఇబ్బందులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాంట్రాక్టు వర్కర్లను, యంత్రాలను ఎక్కువ మందిని వినియోగించుకొని పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

వయ్యారిభామ మొక్కల నిర్మూలన

పటమట(విజయవాడతూర్పు): వయ్యారి భామ కలుపు మొక్కలను నగరంలోని అన్ని ప్రాంతాల్లో నిర్మూలించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఉత్తర్వుల మేరకు 'వయ్యారి భామ – కలుపు మొక్క నిర్మూలన' కార్యక్రమన్ని నగర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. వయ్యారి భామ కలుపు మొక్క, దాని పుప్పొడి ఆస్తమా, చర్మ వ్యాధులతో పాటు వాయు కాలుష్యానికి కూడా కారణమవుతుందని చెప్పారు. ప్రజారోగ్య దృష్ట్యా వాటిని నిర్మూలించాలని పేర్కొన్నారు. నగరంలోని 64 డివిజన్లలోని నివసేతర ప్రాంతాల్లో, ఖాళీ ప్రదేశాల్లో నిరుపయోగంగా పెరుగుతున్న వయ్యారి భామ కలుపు మొక్కలను వేరులతో సహా తొలగించి కాల్చేయాలని తెలిపారు.

నేటి నుంచి శ్రీమత్ రామాయణ ప్రవచన సప్తాహం

కృష్ణలంక(విజయవాడతూర్పు): ధర్మ ప్రచారంలో భాగంగా రాణిగారితోటలోని శ్రీ కోదండ రామాలయంలో టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్, ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో శ్రీమత్ రామాయణ ప్రవచన సప్తాహం ఏర్పాటు చేయడం సంతోషకరమని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు అన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో సప్తాహం కార్యక్రమానికి సంబంధించిన బ్యానర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడపా శేషు మాట్లాడుతూ.. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం నుంచి ఏడు రోజుల పాటు ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు ప్రవచన సప్తాహం జరుగుతుందన్నారు. విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం అనంతరం ప్రముఖ ఆధ్యాత్మికవేత్తలచే శ్రీమత్ రామాయణంలోని వివిధ అంశాలపై ప్రవచనాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ధర్మ ప్రచార మండలి సభ్యులు తన్నీరు పుల్లారావు, నండూరి వెంకట తాండవ కృష్ణ, ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ సి.వి.కె.ప్రసాద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు–2 పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయా పోస్టులు, మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుల భర్తీకి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సీడీపీఓ జి.మంగమ్మ ప్రకటనలో తెలిపారు. విజయవాడ ప్రాజెక్టు –2 పరిధిలోని 11వ డివిజన్ జూర్జిపేటలో అంగన్‌వాడీ కార్యకర్త ఓసీ కేటగిరి, 2వ డివిజన్ మనవరం –1 నందు ఎస్సీ కేటగిరి, 14వ డివిజన్ శ్రీనివాస్ నందు ఓసీ కేటగిరి, 16వ డివిజన్ మధురానగర్ బీసీ –డి కేటగిరి, 17వ డివిజన్ ద్వారకానగర్ నందు ఎస్టీ కేటగిరి, రాణిగారితోట–2 నందు ఓసీ కేటగిరి, 22వ డివిజన్ డ్రైవర్ పేట–2 నందు బీసీ–బి కేటగిరికి కేటాయించామన్నారు. గొల్లపూడి, రామవరప్పాడు నందు ఓసీ కేటగిరి అభ్యర్థులకు అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులను కేటాయించడం జరిగిందన్నారు. ప్రసాదంపాడు –8 నందు మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేయడం జరిగిందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త, మినీ అంగన్‌వాడీ పోస్టులకు 21 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగి 10వ తరగతి ఉత్తీర్ణత పొందిన వారు అర్హులని పేర్కొన్నారు. వివాహితురాలై స్థానికంగా ఉండాలన్నారు. దరఖాస్తులను ఏప్రిల్ 4వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు పెనమలూరు మండలం కానూరు కార్యాలయంలో వ్యక్తిగతంగా అందజేయాలని మంగమ్మ కోరారు.

కానిస్టేబుల్‌కు గాయాలు

పెనమలూరు: పెనమలూరు సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు అవ్వటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఉయ్యూరు కాటూరు రోడ్డుకు చెందిన సోమన జమేష్ నున్న పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. తన డ్యూటీ ముగించుకుని బైక్ పై ఉయ్యూరుకు బయలుదేరాడు. పెనమలూరు సెంటర్ వద్దకు రాగా వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో కానిస్టేబుల్ రోడ్డు పై పడిపోవటంతో గాయాలయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు భవానీ ద్వీపంలో సీతారాముల కల్యాణోత్సవం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక పర్యాటకం(రెలిజీఎస్ టూరిజం) ప్రమోషన్‌లో భాగంగా గురువారం భవానీ ద్వీపంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సీతారాముల కల్యాణం జరుగుతుందన్నారు. అనంతరం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మహిళలతో కోలాటాలు, కూచిపూడి నృత్యం, ఆంధ్రా శివమణిగా పేరొందిన మాస్టర్ చెర్రీ డ్రమ్స్ షో, జానపద డప్పు కళాకారుల విన్యాసాలు, జానపద నృత్యాలు తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం స్వామివార్ల ఉత్సవమూర్తులతో ఊరేగింపు, శ్రీరాములవారి పవళింపు సేవ జరుగుతుందన్నారు. పర్యాటకులు సాధారణ బోటు చార్జీలతోనే ఈ మహోత్సవంలో పాల్గొనవచ్చని కోరారు.

సెలవు రోజుల్లోనూ పన్ను చెల్లింపునకు అవకాశం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థకు చెల్లించాల్సిన పన్నులను నగర వాసులు సెలవు రోజుల్లోనూ చెల్లించేందుకు అవకాశం కల్పించామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం శ్రీరామనవమి సందర్భంగా సెలవు ఉన్నందున పన్ను చెల్లింపుదారులకు అనువుగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నగదు చెల్లింపు కౌంటర్లు పని చేస్తాయన్నారు. నగరపాలక సంస్థ మూడు సర్కిల్స్ కార్యాలయాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఆస్తి, నీటి, ఖాళీ స్థలం పన్నులు, డీఅండ్‌ఓ ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించి నగరపాలక సంస్థ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు.

రేపటి నుంచి శాస్త్రీయ సంగీతోత్సవాలు

విజయవాడకల్చరల్: స్వరఝరి 35వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు శివరామకృష్ణ క్షేత్రంలో శాస్త్రీయ సంగీత మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్వరఝరి కార్యదర్శి మోదుమూడి సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మల్లాది శివానంద యశస్వి గాత్రం, శనివారం కొమ్మాజోస్యుల అలేఖ గాత్రం, ఆదివారం వయోలిన్ విద్వాంసుడు ద్వారం దుర్గాప్రసాద్‌కు చింతలపాటి లక్ష్మి స్మారక పురస్కారం అందిస్తామన్నారు. దుర్గాప్రసాద్ వాయిలీన సంగీత కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

దాడి ఘటనపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువకుడిపై దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గాంధీబొమ్మ ప్రాంతానికి చెందిన తామర అవినాష్ మంగళవారం రాత్రి సాయిరాం సెంటర్‌లో జ్యూస్ తాగేందుకు వెళ్లాడు. అదే సమయంలో అవినాష్ తన బైక్‌పై కూర్చుని ఉండగా ముగ్గురు వ్యక్తులు వచ్చి మమ్మల్ని చూసి ఎందుకు నవ్వుతున్నావంటూ దాడి చేశారు. అదే సమయంలో అటుగా వచ్చిన అవినాష్ స్నేహితుడైన రాజేష్‌పై కూడా దాడి చేయడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఈవెంట్స్ నిర్వాహకుడి ఆత్మహత్య


రత్నాకర్ మృతదేహం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): క్యాటరింగ్, ఈవెంట్స్ నిర్వాహకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన భవానీపురం స్టేషన్ పరిధిలోని విద్యాధరపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌కు చెందిన వేమల రత్నాకర్ (26) నాలుగేళ్లుగా శ్రీనివాస కేటరర్స్ నిర్వహిస్తున్నాడు. ఏడాది కాలంగా ఈవెంట్స్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఓ యాంకర్‌తో పరిచయం ఏర్పడింది. ఈవెంట్స్ ద్వారా వచ్చే డబ్బు ఇంటిలో ఇవ్వడం లేదు. అప్పులు ఎక్కువై ఇంటిలో ఉన్న బంగారు నగలు బ్యాంక్‌లో తాకట్టు పెట్టాడు. కొద్ది రోజుల క్రితం ఈవెంట్స్‌లో యాంకర్‌గా పని చేస్తున్న యువతి రత్నాకర్ ఇంటికి వెళ్లి గొడవ పడింది. ఈ క్రమంలో రత్నాకర్ మంగళవారం గుంటూరు వెళ్లి ఇంటికి వచ్చి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తలుపుతీసి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. స్థానిక హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. రత్నాకర్ ఉరి వేసుకున్న గదిలో టేబుల్ పై ఉన్న పుస్తకంలో యాంకర్ పేరు రాసి ఉందని, చివరిసారిగా ఫోన్‌లో ఆమెతోనే మాట్లాడడన్నారు. తన కుమారుడు బలవన్మరణానికి యాంకర్ కారణమని రత్నాకర్ తండ్రి శ్రీనివాసరావు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.